# 15. సంతకాలు

"ఏరా ఎంకటేశులూ... శనగలు అమ్మావా? మార్క్‌ఫెడ్డోళ్లు కొంటన్నారంట, తీసకపోయి అమ్ముకోరా."

వీధి అరుగు మీద కూర్చుని వేప్పుల్లతో పళ్లు తోముకుంటున్న వెంకటేశ్వర్లుతో, పేపర్ చదవటం కోసం సెంటర్ కాడికి వెళ్తున్న కిష్టయ్య ఆగి అన్నాడు.

"ఎంతచేసి కొంటన్నారంట?" అడిగాడు వెంకటేశ్వర్లు.

"రెండువేల మూడువందల యాభై చేసి కొంటన్నార్రా! అమ్ముకోటం నయం."

"నువ్వు అమ్మావా?"

"నేనా, ఇప్పుడా? ఎప్పుడో పంట ఇంటికి వచ్చినప్పుడే అమ్ముకున్నారా. ఇన్ని రోజులు ఉంటానా నేను మీ మాదిరిగా"

"అప్పుడు ఎంతచేసి అమ్మావేంది?"

"పాతిక వందలు. చూడు ఎంత తేడానో! ఆర్నెల్లనాడే నేను ఆ రేటుకి అమ్ముకుంటిని. అప్పట్నించి ఇప్పటికి వడ్డీలూ, ఎసీ అద్దెలూ, బాడిగలూ,ఖర్చులూ లెక్కచూసుకుంటే ఇప్పుడు ఇరవై వందలే పడేది. ఎందుకు ఎప్పుడియ్యి అప్పుడు నా మాదిరిగా అమ్ముకుంటే పోయేదానికి" అంటూ అతను వెళ్లిపోయాడు.

"అరెపోరా ఎచ్చులోడా...."అనుకుంటూ పళ్లు తోముకుని ఇంట్లోకి వచ్చాడు.

"ఏమే, టీ కాశావా?" భార్యను అడిగాడు.

"ఆ" అంటూ ఆమె కొంచెం పెద్ద గ్లాసుతో టీ తీసుకొచ్చి భర్తకి ఇచ్చింది.

"ఏయ్యా.. డబ్బుల ఎవారం ఎట్ట చేసా? పిల్లోడికి ఇంక వారం రోజుల్లోనే కౌన్సిలింగో ఏదోనంట! వాడు నెలరోజుల్నించీ చెబతానే ఉండే, డబ్బులు అవసరమవతయ్యనీ."

"నేనూ నెల రోజుల్నించి కొట్టుచుట్టూ తిరుగుతానే ఉన్నానే అమ్మి పెట్టమని! కొనేవాళ్లు ఎవరూ లేరంటన్నాడు రంగయ్య"

"మార్కెట్ కమిటీవాళ్లు శనగలు కొంటన్నారంటగా, అమ్మిపారెయ్యి. పీడాకారం వదిలి పోతయ్యి! ఇంక ఎంతకాలం చూస్తాం? మనకేమో డబ్బులు అవసరమాయే!"

"పండిన పంటని పీడాకారం అనుకుంటే ఎట్టే? అమ్ముదాం. ఆ కమిటీ వాళ్ల ఎవారం ఏందో మనకి తెలియదాయె! తెల్సిన వాళ్లని కనుక్కుని వెంటనే అమ్ముకుందాం"

"సరే ముందు డబ్బు చూడు."

టీ తాగి, విషయం ఏదో తెల్సుకుందామని, దండెం మీద కండువా భుజాన వేసుకుని బయటికి వచ్చాడు.

నేరుగా ఎరువుల కొట్టు దగ్గరకి వెళ్లాడు. కొట్టు యజమాని రంగయ్య ఒక్కడే కూర్చుని పేపరు చూస్తున్నాడు.

"ఏం రంగయ్యా... శనగలు ఎవారం ఏందీ? డబ్బు అవసరం వచ్చింది. పిల్లోడికి ఎంసిఎ కౌన్సిలింగ్‌లో ఫీజు కట్టాల. మాయ్యి అమ్మిపెట్టు రంగయ్యా"

"మీయ్యా? మాయ్యే ఏసీల్లో మూడు లారీలు మూలుగుతున్నయ్యి. శనగల్ని అడిగినోడు లేడు. అసలు నువ్వు ఇన్నిసార్లు అడగాలా? కొనేవాడు ఉంటే ఎప్పుడో నీయ్యి అమ్మకపోయానా? మాకు కమీషన్ వచ్చిద్దిగా!"

"మరి ఎట్ట చేయమంటా?"

"మార్క్‌ఫెడ్ వాళ్లు కొంటన్నారట!"

"వాళ్లకి అమ్మమంటావా?"

"బంగారంగా! డబ్బు కూడా అవసరం అంటన్నావుగా!"

"సరే, వస్తా రంగయ్యా!" అంటూ ఇంటికి వచ్చాడు వెంకటేశ్వర్లు.

అన్నం తిన్నాడు.

"ఏమే, ఒంగోలు దాకా పోయి శనగల ఎవారం ఏందో కనుక్కుని వస్తా. మజ్జాన్నం ఒకసారి నువ్వో, పిల్లోడో గొడ్లకాడికి పోయి వాటికి మేతేసిరండి.

నేను తొందరగా వస్తాలే" అంటూ వెంకటేశ్వర్లు డబ్బులు తీసుకుని, ఒంగోలు వెళ్లడానికి బస్టాండ్ దగ్గరికి వెళ్లాడు.

* * *

వెంకటేశ్వర్లకు ఎనిమిది ఎకరాల సొంత పొలం ఉంది.

ఒక కొడుకూ, ఒక కూతురూ! కొడుకు బిఎస్సీ పరీక్షలు పాసై, ఐసెట్ రాసి, ఎంసిఎ కోర్సులో చేరడానికి సిద్ధంగా ఉన్నాడు. కూతురు బికాం రెండో ఏడాది చదువుతోంది.

వెంకటేశ్వర్లు ఒంగోలు మార్కెట్ కమిటీ దగ్గర బస్సు దిగాడు. అక్కడ బయటగేట్ దగ్గర 'తెల్ల శనగల కొనుగోలు కేంద్రం' అని పెద్ద బ్యానర్ వేలాడగట్టి ఉంది.

లోపల ముఠా కూలీలు చెట్టుకింద పడుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇద్దరు ఆఫీసర్లు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"తెల్ల శనగలు అమ్మడానికి వచ్చానండీ" అన్నాడు వెంకటేశ్వర్లు ఒక ఆఫీసరు దగ్గరకు వెళ్లి.

"రేపు రండి, ఒక ఫారం ఇస్తాం. ఆ ఫారం మీద సంతకాలు పెట్టించుకుని వస్తే, అది చూసి సరుకు ఎప్పుడు తెచ్చుకునేది చెపుతాం. ఇంకా ఆ ఫారాలు రాలేదు. రేపు వస్తాయి. రేపు రండి" అన్నాడు ఆయన శాంతంగా, వినయంగా.

"సరే, రేపు వస్తానండీ. మా శనగలు తప్పకుండా కొనాలి" అన్నాడు వెంకటేశ్వర్లు.

"రండి, మేం కొనడానికేగా ఇక్కడ ఉంది" అన్నాడు ఆయన.

వెంకటేశ్వర్లు బయల్దేరి బస్‌కోసం రెండు గంటలు ఎదురుచూసి, సాయంత్రానికి ఇంటికి చేరుకున్నాడు

* * *

పోయిన ఏడాది వెంకటేశ్వర్లు, పంట ఇంటికి వచ్చినప్పుడు క్వింటాల్ 26 వందల ధరకి అమ్ముకున్నాడు. ఆ ఏడాది 80 క్వింటాళ్లు అయ్యాయి. ఊళ్లో ఒక వ్యాపారస్తుడు వెంకటేశ్వర్ల శనగలు కొనుక్కుని, కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేశాడు. తరువాత 3 నెలలకే వాటి ధర పెరిగింది. క్వింటాల్ 42 వందల వరకూ పోయాయి. మంచి ధరకి ఆ వ్యాపారస్తుడు ఆ శనగల్ని అమ్ముకున్నాడు.

ఆ వ్యాపారస్తునికి ఒక్క క్వింటాల్‌కి 15 వందల లెక్కన వెంకటేశ్వర్లు శనగల మీదనే లక్షా ఇరవై వేలు ఆదాయం వచ్చింది.

ఆరుగాలం చాకిరీ చేసి పంట పండించిన రైతుకంటే, మధ్య దళారీనే ఎక్కువ లాభపడ్డాడు.

కొంతమంది రైతులు కూడా నిల్వచేసి, ఎక్కువ ధరకి అమ్ముకుని మంచి ఆదాయం పొందారు.

ఈ ఏడాది పంట ఇంటికి వచ్చిన తరుణంలో ధర 25, 26 వందల మీద ఉంది. అది గిట్టుబాటు ధర కాదనీ, గత ఏడాది ధర ఉండాలనీ రైతులు అధికారుల్నీ, ప్రజాప్రతినిధుల్నీ డిమాండ్ చేయడం మొదలుపెట్టారు.

రైతుల వత్తిడితో ప్రజాప్రతినిధులు కూడా కదిలారు. విదేశీ ఎగుమతుల మీద ఆంక్షలు ఉన్నాయనీ, ప్రధానమంత్రితో మాట్లాడి శనగల ఎగుమతుల మీద ఉన్న ఆంక్షల్ని రద్దు చేయిస్తామని కేంద్రమంత్రీ, ఆమె భర్త అయిన ఎమ్మెల్యే చాలాసార్లు ప్రకటించారు. రైతులు తొందరపడి అమ్ముకోవద్దనీ, గిట్టుబాటు ధర వస్తుందనీ వాళ్లు చెప్పారు. వాళ్ల ప్రకటనలతో రైతుల ఆశలు చిగురించాయి. మంచి ధర వస్తుందని భావించారు.

ఏ రైతూ అమ్ముకోకుండా, పోయిన ఏడాది ధర వస్తుందనే ఆశతో పంటని ఒంగోలులోనూ, పరిసరాల్లోనూ ఉన్న శీతల గిడ్డంగులకి తోలారు.

నాయకుల మాటలు నీటి మూటలయ్యాయి. రైతుల కలలు కల్లలయ్యాయి. ధరలు పెరగడం సంగతి తరువాత, అసలు కొనే వాడే లేకుండా పోయాడు.

"ఛ... ఎంత బాధ... ఎప్పుటియ్యి అప్పుడు అమ్ముకుంటే పోయేదానికి! ఎంతతేడా జరిగింది!" రోజుకి ఏ వందసార్లో అనుకోవడం మామూలైంది వెంకటేశ్వర్లుకి.

* * *

మరుసటి రోజు మళ్లీ వెళ్లాడు.

అక్కడ ఆఫీసరు ఓ ఫారం ఇచ్చి చెప్పాడు. "నీకు పొలం ఉన్నట్లూ, అందులో శనగపంట వేసినట్లూ, నువ్వు సన్నకారు రైతువి అయినట్లూ దీని మీద సంతకాలు పెట్టించుకునిరా.నాలుగు సంతకాలు ఉండాలి. విఆర్ఓ, ఎవో, ఆర్ఐ, ఎంఆర్ఓ.. ఈ నలుగురి సంతకాలు అయిన తరువాత శనగలు కాసిని శాంపిల్ తీసుకుని వస్తే నీవి ఏ రోజు కొనేది చెబుతాం. ఆ రోజు తెచ్చుకుందువు. పొలం ఐదు ఎకరాల లోపు ఉండాలి. ఎకరానికి 8 క్వింటాళ్ల లెక్కన ఒక్కో రైతు దగ్గిరా 40 క్వింటాళ్లు కొంటాం."

ఆ కాగితాలు తీసుకుని ఇంటికి వచ్చాడు వెంకటేశ్వర్లు.

మరుసటి రోజు ఉదయం రంగయ్య కొట్టుకి ఆ కాగితాల్ని తీసుకుని వెళ్ళాడు.

"ఇదేంది రంగయ్యా... ఒక ఏడుపు కాదే! చాలా మంది సంతకాలు పెట్టించాలంటగా? విఆర్ఓ అంటే ఎవురూ?"

"గవర్నమెంటు కొత్తగా విలేజీ రెవిన్యూ ఆఫీసరు అని వేసిందిలే. మనూరికీ మరో రెండూర్లకూ ఒక ఒకే విఆర్వోని వేసింది. ప్రక్క ఊరిలోని పంచాయితీ ఆఫీసుకి వస్తాడు ఆయన. అది పెద్ద ఊరు కదా... పోతూ పట్టాదారు పాసు పుస్తకాలు కూడా తీసకపో" అన్నాడు రంగయ్య.

తనపేరుతో ఒకటీ, భార్యపేరుతో ఒకటీ - రెండు పాస్ పుస్తకాలు ఉన్నాయి. రెండూ తీసుకుని వెళ్లాడు వెంకటేశ్వర్లు.

పంచాయితీ ఆఫీస్ దగ్గరికి వెళ్ళి, విఆర్వో విషయం అడిగాడు అక్కడ ఉన్న గుమాస్తాని.

"విఆర్వోనా? ఆయన రెవిన్యూ డిపార్ట్‌మెంటు. మాకు తెలియదు. ఆయనకి ఆ గది ఇచ్చాం, ఈ నాల్రోజులూ కూర్చోడానికి."

"ఆయనతో నాకు పని బడింది నేనేం చేయాల ఇప్పుడూ?"

"మమ్మల్ని అడిగితే మేమేం చెప్పేం? నువ్వు రేపు రావడమే! ఆయన కోసం చాలామంది వచ్చి పోతన్నారు."

* * *

మరుసటి రోజు మళ్లీ వెళ్లాడు, ఉదయం తొమ్మిదింటికే.

"వస్తే ఆయన పన్నెండు గంటల బస్సుకి వస్తాడు. అప్పటిదాకా చూడు" అన్నాడు గుమాస్తా.

ఆ బస్ వచ్చేవరకూ చూశాడు. ఆయన రాలేదు. ఉసూరుమంటూ ఇంటికి చేరుకున్నాడు. చివరికి మూడో రోజు దొరికాడు ఆయన.

"వెంకటేశ్వర్లూ... నీ పేరు మీద ఐదెకరాల ముప్పయ్ సెంట్లు పొలం ఉందిగా."

"ఉంది..."

"ఇది సన్నకారు రైతులకి సంబంధించిన ఫారం. ఐదెకరాల లోపు ఉన్న వాళ్లకే ఇది వర్తిస్తుంది. ఐదు కంటే ఎక్కువ ఉంటే నువ్వు సన్నకారు రైతువి ఎట్టవుతావు?"

"మూడున్నర ఎకరాలే మంచి పొలం సామీనాది. మిగతాది సవ్వనేల. తొండలు కూడా గుడ్లు పెట్టవు. అందులో గొడ్లకు మేత కూడా కాదు. ఉత్త బీడే!"

"నిజమే, నాకు చెబితే ఎట్ట సరిపోయిద్ది? అది పండేదీ లేనిదీ ఎవుడు చూసాడు? ఐదు కంటే ఎక్కువ ఉంది కాబట్టి నువ్వు మోతుబరి రైతు కిందే లెక్క!"

"మరి ఎట్ట చేయమంటా?"

"ఏం చేస్తాం? నీ భార్య పేరుతో మూడు ఎకరాలుఉంది కదా! ఎకరాకి ఎనిమిది క్వింటాళ్ల లెక్కన నీ భార్య పేరుమీద 24 క్వింటాళ్లు మాత్రం అమ్ముకోవచ్చు."

"నాయ్యి 90 క్వింటాళ్లు ఉన్నాయండీ. పాతిక క్వింటాళ్లు అమ్ముకుంటే ఏ మూలకు? మిగిలిన శనగల్ని ఏం చేయమంటారు? దీనిమీద కూడా సంతకం పెట్టండి" బతిమాలినట్టు అడిగాడు వెంకటేశ్వర్లు.

"అట్ట ఎట్ట వల్లయిద్ది? పుస్తకం మీద ఐదెకరాల కంటే ఎక్కువ కనబడతంటే? తేడా అయితే మా ఉజ్జోగాలు ఊడతయ్యి!"

వెంకటేశ్వర్లు ఎంతసేపు కాళ్ళావేళ్ళాపడి వేడుకున్నా అతను కాదన్నాడు.

"సరే! ఇక యెళ్తా" అని వెంకటేశ్వర్లు కదిలాడు.

"మాట" పిలిచాడు.

వాకిలి దగ్గరికి వెళ్లిన వెంకటేశ్వర్లు వెనక్కి వచ్చాడు.

"డబ్బులు ఇయ్యకుండా పోతున్నావే?" అడిగాడు విఆర్ఓ.

"ఏం డబ్బులూ?"

"ఒక్కో ఫారానికి 50 రూపాయలు తీసుకుంటున్నా వెంకటేశ్వర్లూ. వంద కూడా ఇచ్చిన వాళ్లు ఉన్నారు"

జేబులోంచి పది రూపాయల కాగితం తీసి ఇచ్చాడు.

"మరీ పది రూపాయలా... అడుక్కునే వాళ్ల మాదిరిగా" అన్నాడాయన.

'అడుక్కోవడమే కదా!' అనుకున్నాడు వెంకటేశ్వర్లు.

"దీని మీద కూడా సంతకం పెట్టండి. వందఇస్తా."

"వందకాదు, ఐదొందలు ఇయ్యి, సంతకం పెడతా! ఈ ఫారం మీద నలభై క్వింటాళ్లు అమ్ముకోవచ్చు."

"ఐదొందలు కాదు, రెండొందలు ఇస్తా" అన్నాడు.

చివరికి నాలుగు వందలకి బేరం కుదిరింది. వెంకటేశ్వర్లు ఆ డబ్బు ఇచ్చాక ఆయన రెండో ఫారం మీద కూడా సంతకం పెట్టాడు.

తనేం అన్యాయం చేయలేదు. అక్రమాలకు పాల్పడలేదు.

ఆరుగాలం కష్టించి పండించిన పంటని అమ్ముకోవడానికి వాళ్లకి లంచం ఇవ్వాల్సి వస్తోంది. ఎంత దారుణం!

నాలుగొందలు ఇచ్చేటప్పుడు వెంకటేశ్వర్లు మనసు బాధతో విలవిలలాడి పోయింది. చూస్తూ చూస్తూ ఒక రూపాయికి కూడా ఏదైనా కొనుక్కుని ఎప్పుడూ నోట్లో వేసుకోడు రూపాయి అయిపోతుందనే భయంతో.

ఎంఆర్‌వో ఆఫీసుకి వెళ్లే ఆటో ఎక్కాడు. ఆయన ఆఫీసు పదిమైళ్ల దూరంలో ఉన్న ఊళ్లో ఉంది.

అక్కడికి వెళ్లేసరికి జనం కిక్కిరిసిపోయి ఉన్నారు.

ఎక్కువమంది విద్యార్థులు.ఎంసెట్, ఆసెట్, ఈసెట్, ఐసెట్ – రాసిన పిల్లలు. కులం, ఆదాయం, నివాసం ఇలాంటి వాటి మీద సంతకాల కోసం వచ్చి పడిగాపులు పడుతున్నారు.

ఆర్‌ఐ సంతకాలు అయినా పెట్టిద్దామని అక్కడ ఉన్న గుమస్తాని అడిగాడు.

"ఆర్‌ఐ కూడా ఎంఆర్‌వో వెంట వెళ్లాడు. ఏం సంతకాలూ?" అంటూ ఆయన వెంకటేశ్వర్లు చేతిలోని ఫారాలు తీసుకుని చూశాడు.

"అగ్రికల్చర్ ఆఫీసర్ సంతకం ఉండాలండీ! ముందు ఆయన సంతకం ఉంటేనే ఆర్‌ఐ, ఎంఆర్‌ఓలు సంతకాలు పెడతారు" అన్నాడు ఆ గుమాస్తా.

"ఆయన ఎక్కడ ఉంటాడండీ?"

"నాకు తెలియదు. ఎంపీడివోఆఫీస్‌లో ఎంక్వయిరీ చేయండి. వాళ్లకి తెలిసిద్ది."

ఆ ఆఫీసు పక్కనే ఎంపిడివో ఆఫీసు. అక్కడికి వెళ్లి కుర్చీలో కూర్చున్నామెను అడిగాడు.

"ఏవోగారు రావడం లేదండీ.మా డిపార్ట్‌మెంటు కాదు గదా, మాకు తెలియదు. ఆయన గురించి కరెక్ట్ ఇన్ఫర్మేషన్ కావాలంటే మార్కెట్ కమిటీ దగ్గరకి వెళ్ళి అడగండి, వాళ్లకి తెలుస్తుంది. మూడు మండలాలకి ఏవో ఒకరే" చెప్పింది ఆమె.

మూడు గ్రామాలకి ఒక విఆర్‌ఓ, మూడు మండలాలకు ఒక ఏవో! ప్రభుత్వం బాగా పొదుపు పాటిస్తున్నట్లుంది. మూడు కాదు ముప్పయ్ మండలాలకి ఒక ఏవోని వేసినా వేస్తారు. 'వాళ్లదేం పోతుంది. పని జరక్క ఇబ్బందులు సబ్బందులు పడి చచ్చేది జనమేగా' అనుకుని ప్రభుత్వాన్ని తిట్టుకున్నాడు వెంకటేశ్వర్లు.

ముందు శనగలు అమ్మాలి. వెనుకాముందూ ఆలోచించకూడదు. పని జరగాలి. ఎక్కడున్నా ఏవోని పట్టుకోవాలి.

వెంకటేశ్వర్లు వెంటనే వెళ్లి, మార్కెట్ కమిటీ ఆఫీసులో ఏవో విషయం అడిగాడు.

"ఆయన కూతురి పెళ్లండీ. నాల్రోజుల్నించీ రావడంలేదు. కావాలంటే ఆయన ఫోన్ నెంబర్ ఇస్తాం, కనుక్కోండి" అంటూ ఏవో సెల్ నెంబర్ రాసి ఇచ్చాడు.

వెంకటేశ్వర్లు రూపాయి కాయిన్‌తో ఏవోకి ఫోన్ చేశాడు.

"మా అమ్మాయి పెళ్లి పనుల్లో ఉన్నానండీ, కొంచెం బిజీ. రేపు ఒకసారి ఫోన్ చేయండి."

"మాకు సంతకాలు అవసరం సార్"

"రేపు ఫోన్ చేయమంటున్నాగా."

ఇక చేసేది లేక వెంకటేశ్వర్లు ఇంటికి చేరుకున్నాడు.

* * *

మళ్లీ మరుసటి రోజు ఏవోకి ఫోన్ చేశాడు.

"నేను ఆఫీసుకు రావడం లేదు. నిన్ననే తిరుపతి నుంచి వచ్చాం. మీరు ఆ ఫారాలు ఇంటికి తీసుకువస్తే సంతకాలు పెట్టిస్తా. మీరే కాదు, ఇంక ఎవరైనా ఉన్నా తీసుకురండి" అని, టౌన్‌లో వాళ్ల ఇల్లు ఎక్కడో వివరంగా చెప్పాడు.

వెంకటేశ్వర్లు ఆలస్యం చేయకుండా ఆ ఫారాలు పట్టుకుని బస్సెక్కాడు. తేలికగానే వాళ్ల ఇల్లు కనుక్కున్నాడు.

చాలామంది రైతులు వచ్చారు. వాళ్ల ఊరునించే పది మంది పైన రైతులు వచ్చారు.

"మాదేం దొంగసరుకు కాదు. మేం దొంగతనం, మోసం చేయడం లేదు. అన్యాయంగా ఒకరి సొమ్ము కావాలని కోరుకోవడం లేదు. మా పంటని మేం అమ్ముకోవడానికి ఎన్ని తిప్పలు పెడతందండీ ఈ గవర్నమెంటు!" తిరిగీ తిరిగీ విసుగు పుట్టిన విరక్తితో అన్నాడో రైతు.

"ఏం చేయమంటారండీ! నాకేమో పెళ్లి పనులు. డ్యూటీలో కూడా లేను. ఈ నాల్రోజులూ రైతులు ఎంత ఇబ్బంది పడ్డారో!" బాధనినటిస్తూ సంతకాలు పెట్టి ఇచ్చాడు ఏవో.

ఆ ఫారాలు తీసుకుని వెంకటేశ్వర్లు ఇంటికి బయల్దేరాడు.

'రెండు సంతకాలు అయ్యాయి. మిగిలిన రెండు సంతకాలు కూడా త్వరగా అయితే బాగుండు!' మనసులో అనుకున్నాడు.

పెద్ద గండం గడిచినట్టు అనిపించింది.

* * *

మరుసటి రోజు మంగళవారం ఎంఆర్‌వో ఆఫీసుకు వెళ్లడానికి సిద్ధమవుతూ భార్యతో అన్నాడు. "అన్నం బెట్టవే తొందరగా, బస్సు పోయిద్ది"

"ఇయ్యాల ఏ వూరికి పోవాలి?"

"మండలాఫీసుకి పోవాలి!"

"పనీ పాటా, గొడ్డూ గోదా వదిలేసి ఎన్నిరోజులు తిరుగుతావయ్యా ఇట్ట? ఒకరోజు ఆ పనేదో చేసుకుని వస్తే పోయేదానికి."

"నీకేం చెబుతావే, నాకేం బెమా రోజూ వాళ్ల చుట్టూ తిరగాలని? వాళ్లు దొరకాలీ, సంతకాలు పెట్టాలీ!" విసుగ్గా అన్నాడు.

అన్నం తిని ఎంఆర్‌వో ఆఫీసుకి వెళ్లాడు.

"ఎమ్మార్వో ఇందిరమ్మ గ్రామాలకు వెళ్లారు. ఇళ్ల మంజూరికి సంబంధించి తేడాలు వస్తే అవి చెక్ చేయడానికి వెళ్లారు. సాయంత్రానికి వస్తే రావచ్చు" అన్నారు అక్కడ సిబ్బంది.

'సాయంత్రం రావచ్చు' అనే చిన్నమాట ఆశతోనే చీకటి పడేవరకూ వెంకటేశ్వర్లుతో పాటు చాలామంది రైతులు పడిగాపులు పడ్డారు. ఆమె రాలేదు. అటునించి అటే ఇంటికి వెళ్లినట్లు తెల్సింది. జిల్లా కేంద్రంలో ఆమె నివాసం. రైతులు నిరాశగా వెనక్కి తిరిగి పోయారు.

* * *

బుధవారం అదే పరిస్థితి.

గురువారం వీళ్లు వెళ్లేసరికి ఎమ్మార్వో ఉంది. చాలామంది రైతులు ఎదురు చూస్తూ ఉన్నారు. ఇవ్వాళయినా అవుతాయో, కావో అని రైతుల ముఖాల్లో ఆందోళనా, భయం!

ఈ లోగా మండలంలోని చౌక డిపో డీలర్ల నాయకుడు మోటరు సైకిల్ మీద వచ్చాడు. అతనికీ, ఎమ్మార్వోకీ మంచి సంబంధాలు ఉన్నాయని రైతులందరికీ తెలుసు. అతను నెల నెలా డీలర్లు అందరి వద్దా నెలసరి మామూళ్లు వసూలు చేసి గుండగుత్తగా సమర్పిస్తుంటాడు. తమకి సంతకాలు పెట్టించమని రైతులు కొందరు ఆ డీలర్ నాయకుడి వెంటబడ్డారు "అందరికీ సంతకాలు పెట్టి పంపిస్తా. తొందర పడవద్దు"అంటూ అతను ఎమ్మార్వో రూంలోకి వెళ్లి ఆమెతో మాట్లాడి కొద్దిసేపు తర్వాత బయటికి వచ్చాడు.

"ఒక్కో ఫారం మీద సంతకానికి నాలుగు వందలు అడుగుతున్నారయ్యా ఎమ్మార్వో గారు. నేను అంత ఇవ్వలేరని చెప్పాలే. ఎంత ఇద్దాం? వాళ్ళకీ చాలా ఖర్చులుంటాయి."

"వాళ్ల ఖర్చులకి గవర్నమెంటు జీతాలు ఇవ్వడం లేదంటనా?"

"నాలుగు వందలు సరిపోతాయంటనా?"

"వీళ్లకంటే రెడ్‌లైట్ ఏరియా వాళ్లు నయం!" రైతులు ఒక్కొక్కరు ఒక్కోవిధంగా పెద్దగానే కామెంట్ చేయడం మొదలుపెట్టారు. డీలర్ ఎమ్మార్వోకి దళారీపని చేస్తుంటాడు. చివరికి రెండు వందలకి అంగీకారం కుదిరింది.

"మీ పుస్తకాలు ముందు ఆర్ఐకి ఇవ్వండి. ఆయన సంతకం పెట్టి ఎమ్మార్వో చేత పెట్టిస్తాడు" అన్నాడు డీలర్.

ఆర్ఐ ఒక్కో ఫారానికి వంద అడిగాడు. చివరికి 40 ఇవ్వడానికి బేరం కుదిరింది.

"ఛ... ఛ... ఎంత లంచగొండితనం! ఎంత మామూలైంది. తమ శనగలు తాము అమ్ముకోవడానికి ఎన్ని బాధలు!" మనసు మూలిగింది.

"మీరందరూ నా చుట్టూ ఎందుకు? పుస్తకాలు ఇవ్వండి "ఒక్కో రైతుని పిలుస్తాను" అని ఆర్ఐ పుస్తకాల్ని తన రూంలోనికి తీసుకెళ్ళాడు.

తరువాత ఒక్కోరైతుని పిలిచి, పాస్ పుస్తకం తన దగ్గరున్న రికార్డు బుక్‌లో సరిచూసి పట్టా నెంబర్లూ, విస్తీర్ణం అన్నీ సక్రమంగా ఉంటే సంతకం పెట్టి తన ఎదురు టేబుల్ మీద పెట్టుకున్నాడు.

పట్టా నెంబర్లలో తేడా ఉంటే వంద రూపాయలు, ఐదు ఎకరాలకంటే ఎక్కువ ఉంటే రెండు వందలు డిమాండ్ చేస్తున్నాడు. వెంకటేశ్వర్లుని పిలిచాడు. తన పాస్ పుస్తకంలో ఐదు ఎకరాల కంటే ఎక్కువ ఉండటంతో మరోమాట మాట్లాడకుండా రెండు వందలు సమర్పించుకున్నాడు వెంకటేశ్వర్లు.

ఆర్ఐ తరువాత, ఎమ్మార్వో వాటి మీద సంతకాలు పెట్టాలి. ఇంతలో ఫోన్ వచ్చింది.

"నేను అర్జంట్ పని మీద వెళ్తున్నాను. వాళ్లని సోమవారం రమ్మనండి. రేపు కలెక్టర్‌తో మీటింగ్. ఎల్లుండి రెండో శనివారం. ఇక సోమవారం రావాల్సిందే వాళ్లు" ఆర్ఐకి చెప్పి, రైతుల ముఖం కూడా చూడకుండా చకచకా నడుచుకుంటూ వచ్చి జీప్ ఎక్కింది.

"ఏమండి... ఏమండీ... ఉండండి... ఉండండీ..." అని కొందరు రైతులు కేకలు పెడుతున్నా ఆమె వీళ్ల మాటని చెవిన వేసుకోకుండా డ్రైవర్‌కి పోనివ్వమని చెప్పింది.

ఉసూరుమంటూ ఇంటికి చేరుకున్నాడు వెంకటేశ్వర్లు.

* * *

సోమవారం నాడు మళ్ళీ మండల కార్యాలయం చేరుకున్నాడు. చాలా సందడిగా ఉంది. పైరవీకార్లు, పంచాయితీ ప్రెసిడెంట్లు, దళారులు, చోటామోటా నాయకులు ఆఫీసు ప్రాంగణంలో తిరుగుతున్నారు. ఎమ్మెల్యే వస్తున్నాడని వాళ్లు వచ్చారు. ఎమ్మెల్యే ప్రతిపక్ష పార్టీవాడు.

మండలంలో మంజూరైన ఇందిరమ్మ గృహాలలోనూ, వృద్ధాప్య పింఛన్లలోనూ భారీ అవకతవకలు జరిగాయి. ఎమ్మార్వో అధికార పార్టీ వారికే వాటిని కేటాయించారు. వచ్చిన ఒత్తిళ్ళ కారణంగా ఆ కేటాయింపులు అన్నీ కూడా బాగా డబ్బున్నవాళ్లకే! నిరుపేదలకి ఇవ్వకపోతే మానె, తమ పార్టీ వాళ్లకి కనీస ప్రాధాన్యం ఇవ్వలేదు. ఈ విషయం అడగాలని ఎమ్మెల్యే వస్తున్నాడని ఆ పార్టీ వాళ్లు మందలుగా చేరారు.

ఎమ్మార్వోకి దిక్కుతోచకుండా ఉంది. భయపడిపోయింది. ఎమ్మెల్యే అంటే టెర్రర్. అసలే అయన గూండా ఎమ్మెల్యే!

ఆయన రావటానికి ముందే ఆమె కాగితాల్ని సరిచూసుకునే పనిలో పడింది.

రైతులు మామూలే!

ఒంటిగంట ప్రాంతంలో నాలుగు కార్లు వెంటరాగా ఎమ్మెల్యే మందీ మార్బలంతో దిగాడు. మీటింగ్ హాల్లో ఆసీనుడయ్యాడు.

ఒక్కో ఊరినుంచి తన పార్టీ వాళ్లను పిలవడం, ఎమ్మార్వోని సంజాయిషీ అడిగి చివాట్లు వేయడం!

సాయంత్రం నాలుగ్గంటలకి వెళ్లిపోయాడాయన.

ఆర్ఐ పాస్ పుస్తకాలు చూసి, ఫారాలు రెడీ చేసి ఒక బండెడు అయితే తీసుకుపోయి ఎమ్మార్వో టేబుల్ మీద పెట్టాడు. ఎమ్మెల్యే తిట్లకి ముఖం నల్లగా పెట్టుకున్న ఆమె తన రూంలోకి వెళ్లి తలుపులు బిగించుకుంది.

"అమ్మగారు భోజనం చేయాలి. మీరు వాకిలి దగ్గర లేవండి" అని బంట్రోతు అక్కడి వాళ్లని బయటికి పంపించాడు.

కొత్తగది నిర్మించడం కోసం అక్కడ ఇసుక తోలివుంటే కొందరు రైతులు కండువా తలకింద పెట్టుకుని ఇసుక మీద పడుకున్నారు, ఆకలికి నకనకలాడిపోతూ. ఎప్పుడో ఉదయం తిని వచ్చిన తిండి. ఊరికి దూరంగా ఉన్న ఆఫీసు దగ్గర తినేవి కూడా ఏమీ ఉండవు. అమ్ముకునే ఒకావిడ దగ్గరున్న బోండాలూ, గారెలూ, ఫ్లాస్కులోని టీ అన్నీ మొదటి దెబ్బకే అయిపోయాయి.

ఎమ్మార్వో సంతకాలు అయ్యేసరికి ఏడున్నర అయింది.

అన్నీ ఆర్ఐ ఒకేసారి తన రూంలోకి తెచ్చాడు. బంట్రోతు రాజముద్రా, ఎమ్మార్వో ముద్రా రెండూ వేశాడు.

"రండి, డబ్బులు ఇచ్చి ఎవరి ఫారాలు వాళ్లు తీసుకుపోండి" అని గుమస్తా రైతుల దగ్గరికి వచ్చాడు.

రైతులకు కడుపు మండింది. ఒకవైపు ఆకలీ, మరోవైపు విసుగూ! ఒక్క సంతకం కోసం పొద్దుట్నించీ పడిగాపులు!

"ఒక్కపైసా ఇవ్వం. మా ఫారాలు ఇస్తే ఇవ్వండి, లేకపోతే మీ దగ్గరే ఉంచుకోండి. ఎంతసేపు ఉంచుకుంటారో చూస్తాం" అని రైతులు ఎదురు తిరిగారు.

160 పుస్తకాలు. 30, 32 వేలు వస్తాయని ఎమ్మార్వో రూంలో కూర్చుని లెక్కలు వేసుకుంటోంది.

బంట్రోతు వెళ్ళి ఆమెకు విషయం చెప్పాడు. ఆమె అతనికి ఏదో చెప్పి రైతుల వద్దకు పంపించింది.

"ఆఫీసరమ్మతో మీకు ఎప్పుడైనా అవసరాలు ఉంటాయి. ఎంతో కొంత ఇచ్చి మీ ఫారాలు తీసుకోండి. మొన్న మీరే ఇస్తామని ఒప్పుకున్నారుగా?" బంట్రోతు రైతుల్ని బతిమాలాడు.

"మొన్న అయితే ఇచ్చేవాళ్లం. ఆ రోజు ఎందుకు సంతకం పెట్టలేదు? మాకు పనులేం ఉండవా? ఒక సంతకం కోసం ఎన్ని రోజులు తిరగాలి మీ చుట్టూ?" రైతులు కోపంతో అరిచారు.

ఒకరూ, ఇద్దరూ, పదిమంది రైతులు అయితే ఇచ్చేవాళ్లేమో కానీ, రైతుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో అందరూ సామూహికంగా ఎదురు తిరిగారు. ఎవరైనా ఇద్దామని కొంచెం మెత్తబడినా వారిని మిగతా వాళ్లు కొట్టినంత పనిచేశారు.

చివరికి రాత్రి పదిగంటలకి ఎమ్మార్వో అసహనంగా ఎవరి ఫారాలు వాళ్లకి ఇవ్వమని చెప్పి జీప్ ఎక్కింది.

విజయగర్వంతో రైతులు ఫారాలూ, పాస్ పుస్తకాలూ తీసుకున్నారు.

ఇళ్లకి వెళ్లడానికి ఆ టైంలో ఏం ఉంటాయి?

రెండు ఆటోలు వచ్చాయి. వాళ్లు మనిషికి 40 రూపాయలు అడిగారు.

"సరే పద" అన్నారు రైతులు.

రెండు ఆటోలు నిండిపోగా చాలామంది రైతులు ఆగిపోయారు. ఆ ఆటోల్ని మళ్లీ రమ్మని చెప్పారు.

చివరికి వెంకటేశ్వర్లు ఇంటికి చేరుకునే సరికి కోడి కూసే వేళయింది.

వేళ దాటిపోవడంతో అన్నం, నీళ్లు ఏం లేకుండా కాళ్లూ చేతులూ కడుక్కుని మంచం ఎక్కాడు.

"రేత్రి గొడ్ల ముకాన మేత లేదు. ఈ తిరగడం ఏందంట?" అంది భార్య తెల్లారి.

వెంకటేశ్వర్లు ఏం మాట్లాడకుండా గొడ్ల దగ్గరకి పోయి, పేడకళ్లు తీసి, బాగు చేసి కుడితి పెట్టి కట్టేశాడు. వామి నించి మేత దూసి దిట్టంగా వేశాడు.

ఇంటికి వచ్చి సాన్నం చేసి, అన్నం తిని డబ్బు తీసుకున్నాడు.

"మళ్లా ఇయ్యాల ఎక్కడికీ?" భార్య ఆశ్చర్యపోతూ అడిగింది.

"ఇంతవరకూ శనగల అమ్మకం ఎవారం అసలు మొదలు కాలేదు కదే" అని, విషయం ఆమెకు చెప్పాడు.

స్టాండ్‌కి వచ్చి ఒంగోలు మార్క్‌ఫెడ్ దగ్గరికి వెళ్లడానికి బస్సెక్కాడు – 'ఇక మార్క్‌ఫెడ్ వాళ్ళ కథా– కమామిషు ఏమిటో, వాళ్లు ఎన్ని చుట్లు తిప్పించుకుంటారో, ఎన్ని తంటాలు పెడతారో, ఎన్ని యాతనలు పడాలో...' అనుకుంటూ.

ఆదివారం ఆంధ్రజ్యోతి – 26 ఆగస్టు, 2007